క్లుప్తంగా

వైభవంగా పుష్కర బ్రహ్మోత్సవాలు



తిరుకల్యాణం నిర్వహిస్తున్న పండితులు

సీటీఆర్ఐ: లాలాచెరువు వద్ద గల గోవింద క్షేత్రంలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పుష్కర బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీమన్నారాయణస్వామి మాట్లాడుతూ ఆలయం నిర్మించి 12 ఏళ్లు దాటి 13వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా స్వామివారికి పుష్కర బ్రహ్మోత్సవాలను మంగళవారం వరకూ ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈనెల 23న త్రిదండి శ్రీరామచంద్ర రామనుజ జీయర్ స్వామి గోవింద క్షేత్రానికి విచ్చేసి, భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారన్నారు. కాగా.. ఆదివారం స్వామివారికి తిరుకల్యాణం ఘనంగా నిర్వహించారు.

వేసవి శిక్షణ తరగతులు



చదరంగంలో మెళకువలు నేర్పుతున్న కోచ్ జగన్నాథం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరుగుతున్నాయి. పుస్తక పఠనం, నీతికథలు చెప్పడం, హ్యాండ్‌క్రాఫ్ట్, చదరంగం, తెలుగు పద్యాలు, లలిత సంగీతం తరగతులు నిర్వహించారు. చెస్ కోచ్ కంచుమర్తి జగన్నాథం విద్యార్థులకు చదరంగంలో మెళకువలు తెలిపారు. విద్యార్థులకు శ్రీనిధి జ్యుయలర్స్ అధినేత కారుమూరి నరసింహమూర్తి గుప్తా పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ



బంగారు పతకం సాధించిన శ్వేణి ఇషిత

ప్రకాశం నగర్: శ్రీకాకుళంలో జరిగిన మాస్టర్ సాయిబాబా మెమోరియల్ ఫస్ట్ నేషనల్ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో రాజమహేంద్రవరానికి శ్వేణి ఇషిత బంగారు పతకం, చైతన్య ప్రేమ్ సిల్వర్ పతకం సాధించారు. వీరు జిల్లా ఔషధ నియంత్రణాధికారి నాగమణి పిల్లలు. ఆ వివరాలను ఎస్ఎమ్ కుంగ్‌ఫూ మాస్టర్ ఎం.నాగరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ పోటీలకు 16 మంది హాజరు కాగా, వారిలో ఎనిమిది మంది బంగారు, ఐదుగురు వెండి, ముగ్గురు రజత పతకాలు సాధించారన్నారు. పోటీలకు హాజరైన విద్యార్థులందరూ విజయ పతాకాలు ఎగురవేశారన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొటికలపూడి



వెంకటేశ్వరరావును అభినందిస్తున్న బొమ్మల దత్తు

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కడియం మండలానికి చెందిన కొటికలపూడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి జారీ చేసిన నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు చేతుల మీదుగా నాయకుల సమక్షంలో ఆదివారం పార్టీ నగర కార్యాలయంలో వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, బూరా రామచంద్రరావు, కాలెపు సత్యసాయిరామ్, ఆకుల శ్రీధర్, మానాపు ఏసు, కరుటూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

ప్రకాశం నగర్: సిటీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ద్వారా శిక్షణ పొందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు అసోసియేషన్ సభ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. అండర్ 16 బాల బాలికల విభాగంలో ఈనెల 16 నుంచి 19 వరకు పాలకొల్లులో 6వ రాష్ట్రస్థాయి బాస్కెట్ పోటీలు జరిగాయన్నారు. అసోసియేషన్ ద్వారా శిక్షణ పొందిన బాలికల జట్టు రాష్ట్ర ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. జాతీయ పోటీలకు ఎంపికైన జట్టును అసోసియేషన్ సభ్యులు చక్రవర్తి, మాణిక్యాలరావు అభినందనలు తెలిపారు.

కూ.. చకచకా..

- చురుగ్గా రైల్వేకోచ్ రెస్టారెంట్ పనులు
- జూన్‌లో ప్రారంభోత్సవానికి చర్యలు
- 24 గంటలూ అందుబాటులో ఆహార పదార్థాలు



కోచ్ లోపలి భాగం



శరవేగంగా సిద్ధమవుతున్న రైల్వేకోచ్ రెస్టారెంట్

రాజమహేంద్రవరం సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికులను ఆకట్టుకునేందుకు రైల్వేశాఖ వినూత్న ప్రయోగాలు చేస్తోంది. అందులో భాగంగా రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో 24 గంటలూ ఆహార పదార్థాలను అందించేందుకు రైల్వే కోచ్ రెస్టారెంట్‌ను సిద్ధం చేస్తోంది. సుమారు 25 ఏళ్ల పాటు ప్రయాణికులకు సేవలందించిన తర్వాత తీసివేసిన ఏసీ కోచ్‌లను ఈ విధంగా రెస్టారెంట్‌గా తీర్చిదిద్దుతోంది. త్రీస్టార్ రేంజ్‌లో వీటిని సిద్ధం చేస్తున్నారు.

అన్నిరకాల పదార్థాలు

రాజమహేంద్రవరంలో రాత్రి 12 గంటలు దాటితే ఎక్కడా ఆహారం దొరికే పరిస్థితి లేదు. ఈ రైల్వే కోచ్ రెస్టారెంట్ ప్రారంభమైతే 24 గంటలూ ప్రయాణికులకు, ప్రజలకు ఆహారం అందుబాటులో ఉంటుంది. ఇక్కడ కాఫీ, టిఫిన్, భోజనంతో పాటు వెజ్, నాన్‌వెజ్ నూడిల్స్, బిర్యానీ, ఫ్రైడ్ రైస్, సౌత్, నార్త్ ఇండియన్, చైనీస్, కాంటినెంటల్ వంటకాలు లభిస్తాయి. ఈ ఆహారాన్ని లైవ్‌లో తయారు చేసి అందించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు 36 మంది కూర్చునే సదుపాయం కలిగిన ఈ కోచ్ రెస్టారెంట్‌ను పుట్టినరోజు పార్టీలకు ఇవ్వనున్నట్లు సమాచారం.

అధునాతనంగా..

రెస్టారెంట్ లోపల ఆధునాతన కుషన్ సీట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వే కోచ్‌లో ప్రయాణిస్తూ అనుభూతి పొందాలనుకునే వారికి ఈ రెస్టారెంట్ కొత్త అనుభవాన్ని అందించనుంది. ఈ కోచ్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న ఈ రెస్టారెంట్ ఏరియాను గ్రీనరీతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే విభాగంలో మొదటగా గుంటూరులో ఏర్పాటు చేశారు. విజయవాడ డివిజన్‌లో విజయవాడ, రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్లలో సిద్ధమవుతున్నాయి.

అందుబాటులో ఆహారం



రైల్వేకోచ్ రెస్టారెంట్‌లో 24 గంటలూ కోరుకున్న ఆహారం దొరుకుతుంది. త్వరలో ప్రారంభం కానున్న ఈ రెస్టారెంట్ నగర ప్రజలతో పాటు జిల్లా ప్రజలను ఆకట్టుకోనుంది. రాత్రి 12 గంటలు దాటితే నగరంలో ఆహారం దొరకని పరిస్థితి. రైల్వే కోచ్ రెస్టారెంట్‌తో ఆ బాధలు తీరనున్నాయి.

– సీరపు నాగకృష్ణ మోహన్‌రెడ్డి

దివ్యాంగ ఉద్యోగుల సంఘ కార్యవర్గం ఎన్నిక

కడియం: గ్రామ, వార్డు సచివాలయాల దివ్యాంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పి.అశ్వర్థప్ప (శ్రీసత్యసాయి జిల్లా), ప్రధాన కార్యదర్శిగా మర్రి కాశీవిశ్వనాథం (తూర్పుగోదావరి జిల్లా) ఎన్నికయ్యారు. ఈ మేరకు కాశీవిశ్వనాథం ఆదివారం స్థానిక విలేకరులకు వివరాలు తెలిపారు. ఇటీవలే సంఘాన్ని రిజిస్టర్ చేసి, సభ్యుల సమావేశం నిర్వహించామన్నారు. అందులో భాగంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. వైస్ ప్రెసిడెంట్లుగా తన్నేరు రామాంజనేయులు (పల్నాడు), సూదాబత్తుల వెంకటేశ్వరరావు (కృష్ణా), సంతోష్ అన్సారి (శ్రీకాకుళం), మొక్కలకట్టి నాగభూషణరావు (ఎన్టీఆర్), అదనపు కార్యదర్శిగా ప్రత్తిపాటి ప్రేమ్ సుధాకర్ (ఎన్టీఆర్), ట్రెజరర్‌గా వల్లూరి వెంకటేశ్వరరావు (గుంటూరు), ఈసీ మెంబర్లుగా పుట్టంరాజు రవిమాధవ్ (బాపట్ల), యలమద్ది లక్ష్మీనరసింహరావు (ఎన్టీఆర్), మారిశెట్టి గణపతి (తూర్పుగోదావరి) ఎంపికయ్యారన్నారు.

ఉత్సాహంగా హ్యాపీస్ట్రీట్



హ్యాపీస్ట్రీట్‌లో పాల్గొన్న చిన్నారులు

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏకేసీ కాలేజీ రోడ్డులో ప్రతి ఆదివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటలవరకూ నిర్వహిస్తున్న హ్యాపీస్ట్రీట్ కార్యక్రమంలో నగర ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారు. జుంబా డ్యాన్స్, లైవ్ సింగింగ్, మ్యూజిక్, స్నేక్స్ లాడర్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి ఆటలతో పాటు హెల్త్ క్యాంప్‌ను సైతం ఇక్కడ నిర్వహిస్తున్నారు. పిల్లల కోసం ఏర్పాటు చేసిన ట్రాంపోలిన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రత్యేక వేదికపై స్రవంతి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

హీరో నవదీప్ సందడి



సూర్య థియేటర్‌లో మాట్లాడుతున్న హీరో నవదీప్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆహాలో స్ట్రీమింగ్ అవుతున్న న్యూసెన్స్ వెబ్ సిరీస్ పాజిటివ్ రివ్యూస్‌తో మంచి విజయం అందుకుందని హీరో నవదీప్ అన్నారు. ఆదివారం స్థానిక సూర్యథియేటర్‌లో న్యూసెన్స్ స్క్రీనింగ్‌షోలో ఆయన సందడి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ న్యూసెన్స్ వెబ్ సీరిస్‌కు అపూర్వ విజయం దక్కిందన్నారు. త్వరలోనే న్యూసెన్స్ సీజన్2ను అందిస్తామని, దాని షూటింగ్ 30 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. మన సమాజంలో మీడియాకున్న ప్రాధాన్యతలపై ప్రశ్నలను లేవనెత్తడమే న్యూసెన్స్ సిరీస్ ఉద్దేశమన్నారు.

రేపటి నుంచి వలంటీర్లకు పురస్కారాలు

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరవేస్తున్న వలంటీర్లను అభినందిస్తూ ప్రభుత్వం పురస్కారాలు ప్రకటించింది. వాటిని మండల స్థాయిలో వలంటీర్లకు అందజేసి, అభినందించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం జేగురుపాడు హైస్కూల్లో జేగురుపాడు, మాధవరాయుడుపాలెం గ్రామాలకు చెందిన వలంటీర్లకు పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. 25న మురమండ కల్యాణ మండలంలో మురమండ, దుళ్ల వలంటీర్లకు, 26న కడియపుసావరం, దామిరెడ్డిపల్లి గ్రామాల వలంటీర్లకు కడియపుసావరం పూలవర్తక సంఘం కల్యాణ మండపంలో, 27న గిరజాల కల్యాణ మండపంలో కడియం వలంటీర్లకు, 29న కడియపులంక హైస్కూల్లో కడియపులంక వలంటీర్లకు, 30న వీరవరం హైస్కూల్లో వీరవరం, పొట్టిలంక వలంటీర్లకు, 31న వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద వేమగిరి వలంటీర్లకు ఈ పురస్కారాలు అందజేస్తారు. మండల పరిధిలోని మొత్తం 478 మందికి పురస్కారాలు దక్కాయి. వీరిలో ఇద్దరికి సేవావజ్ర, ఏడుగురికి సేవారత్న, 469 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేస్తారు. దుళ్ల సచివాలయం 2 వలంటీర్ సుంకర సురేష్, కడియపులంక సచివాలయం 2 వలంటీర్ కొల్లి శశికళ సేవావజ్ర పురస్కారానికి ఎంపికయ్యారు. రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుగుతుంది.

నిరంతరం దైవ నామస్మరణ చేయాలి



మాట్లాడుతున్న హరిప్రసాద్ ధర్మ

ప్రకాశం నగర్: నవవిధ భక్తిమార్గాల్లో దైవ నామస్మరణ సులభమైనదని, దాన్ని నిరంతరం సాధన చేయాలని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర వేదాధ్యయన సమన్వయకర్త హరిప్రసాద్ ధర్మ పిలుపునిచ్చారు. ఆదివారం గోదావరిబండ్ రోడ్డులోని త్యాగరాజ నారాయణదాస సేవాసమితి సమావేశ మందిరంలో సత్యసాయి సేవాసంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 42వ నమామి సాయిశత రుద్రీయం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హరిప్రసాద్ ధర్మ మాట్లాడుతూ భగవంతుణ్ణి దర్శించడానికి ఆధ్యాత్మిక సాధన ఎంతో అవసరమన్నారు. భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా విశ్వశాంతి కోసం సాయిశత రుద్రీయం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేస్తున్నామని, రాజమహేంద్రవరంలో 42వ కార్యక్రమం నిర్వహించడం భక్తులలో ఎంతో ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపిందన్నారు. ఈ సందర్భంగా లింగ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం కోళ్ల వీరాస్వామి కల్యాణ మండపం నుంచి కుమారి టాకీస్ మీదుగా త్యాగరాజ సేవా సమితి భవనం వరకూ కోలాటం, మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, సామూహిక భజనలతో సత్యసాయిబాబా చిత్రపటాన్ని, పాదుకులను పల్లకీలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. కార్యక్రమాన్ని ఢిల్లీ సత్యసాయి సేవాసంస్థల అధ్యక్షుడు ఎల్‌వీఎం కిషోర్ జ్యోతి ప్రజ్వలన చేసి, ప్రశాంతి పతాకా విష్కరణ చేశారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్, రాష్ట్ర విద్యా విభాగ సమన్వయకర్త వి.శకుంతల, సత్యసాయి గురుకులం ప్రిన్సిపాల్ గురవయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాశిక్షణ తరగతులు



శిబిరంలో ఆటలు ఆడుతున్న చిన్నారులు

ప్రకాశం నగర్: జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈనెల 8న ప్రారంభమైన చిన్నారుల వేసవి క్రీడా శిక్షణ తరగతులకు విశేష ఆదరణ లభిస్తోంది. జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు శిక్షణ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు టీ షర్టులు, ట్రాక్ ప్యాంట్లు, షూస్ అందజేశారు. వివిధ క్రీడాల్లో నైపుణ్యం ఉన్నవారిని కోచ్‌లుగా నియమించారు. శిక్షణ అనంతరం పిల్లలకు రాగిజావ, కోడిగుడ్డు, అరటిపండు అందజేస్తున్నారు.

హీరో ప్రభాస్ అభిమానుల పూజలు



జాంపేట కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న ప్రభాస్ అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): హీరో ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమాలో జై శ్రీరామ్ పాట విడుదల సందర్భంగా జాంపేట పోలీస్ క్వార్టర్స్‌లోని కోదండ రామాలయంలో అభిమానులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజమండ్రి ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు టి.శివప్రసాద్, ఉపాధ్యక్షుడు వై.దేవీప్రసాద్, గౌరవ అధ్యక్షుడు డి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాంపేట గాంధీబొమ్మ సెంటర్ నుంచి దేవీచౌక్ మీదుగా పుష్కరఘాట్ వరకు భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. జీవన్, సచిన్, సాయి పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు కృషి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బాలేపల్లి మురళీధర్

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా జాంపేటలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ దేశ ఆర్థిక పరిపుష్టికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు అద్భుతమన్నారు. నేడు మతతత్వ బీజేపీ ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొడుతూ దేశంలో అలజడి సృష్టిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శులు బెజవాడ రంగారావు, ముళ్ల మాధవ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు ఆకుల భాగ్య సూర్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక జెండాపంజా రోడ్డులోని రాజీవ్ గాంధీ విగ్రహానికి సీనియర్ కాంగ్రెస్ లీడర్ శ్యామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

- కడియం మండలంలో 15కి పైగా విరిగిన స్తంభాలు
- చెట్లు కూలిపోయి ధ్వంసమైన విద్యుత్ తీగలు



వీరవరం – దుళ్ల రోడ్డులో ఒరిగిపోయిన స్తంభాన్ని నిలబెడుతున్న సిబ్బంది



దుళ్ల బైపాస్ రోడ్డులో తీగలపై పడిన కొమ్మలను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

కడియం: గాలీవాన బీభత్సం కారణంగా శనివారం సాయంత్రం విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కడియం, మురమండ సెక్షన్ల పరిధిలో సుమారు 15 వరకు స్తంభాలు విరిగిపోయాయని, పలు చోట్ల వైర్లు తెగిపడ్డాయని ఆ శాఖ సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా 11 కేవీ విద్యుత్ లైన్లకు ఈ గాలివాన తీవ్రనష్టం కలిగించింది. కడియం సెక్షన్ పరిధిలోని జేగురుపాడులో ఏడు స్తంభాలు విరిగాయని ఏఈ రామారావు తెలిపారు. గాలి తీవ్రత అక్కడే ఎక్కువగా ఉందదన్నారు. మిగిలినచోట్ల ఎటువంటి డ్యామేజీ లేదని వివరించారు. మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని చైతన్య నగర్ కాలనీలో సంపద నగరం సెక్షన్ నుంచి వచ్చే సరఫరా మినహా కడియం సెక్షన్ నుంచి వచ్చే సరఫరాను పునరుద్ధరించామన్నారు. ఆదివారం సాయంత్రానికి మిగిలిన భాగానికి కూడా సరఫరా పూర్తిస్థాయిలో చేస్తారని తెలిపారు. అలాగే మురమండ సెక్షన్ పరిధిలోని మాధవరాయుడుపాలెంలో ఒక స్తంభం విరిగిందని ఏఈ జ్యోతి తెలిపారు. దామిరెడ్డిపల్లిలో క్రాస్‌ఆర్మ్ ఒకటి విరిగిపోయిందన్నారు. 11 కేవీ విద్యుత్ వైర్లు చాలా వరకు చెట్లు పడిపోయిన కారణంగా తెగిపడ్డాయన్నారు. అందుబాటులో ఉన్న సిబ్బందితో రాత్రింబవళ్లు సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

యంత్రాల సాయంతో..

వీరవరం – దుళ్ల రోడ్డులో ఒరిగిపోయిన స్తంభాలను యంత్రాల సాయంతో నిలబెడుతున్నారు. కడియం వయా వీరవరం దుళ్ల రోడ్డు, దుళ్ల నుంచి మడికి వెళ్లే రోడ్డు, కడియం నుంచి మండపేట వయా దుళ్ల మీదుగా వెళ్లే రోడ్లలో పలుచోట్ల చెట్లు విరిగి రోడ్లకు అడ్డంగా పడిపోయాయి. దీంతో విద్యుత్, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ శాఖల సిబ్బంది రోడ్లకు అడ్డుగా పడిన చెట్ల తొలగింపు ప్రక్రియను చేపట్టారు. పలు మార్గాల్లో ఆదివారం ఉదయానికి రాకపోకలు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా ఉద్యాన పంటలకు కూడా ఈ గాలివాన నష్టం మిగిల్చింది. పలు నర్సరీల్లో మొక్కలు పడిపోయాయి. ముఖ్యంగా 21, 30, 50 బ్యాగు సైజులు ఉన్న మొక్కలు ఎక్కడికక్కడే పడిపోయాయి. దుళ్లలో అరటి తోటలు దెబ్బతిన్నాయి.

టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి రాక



విమానాశ్రయంలో వైవీ సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

మధురపూడి: టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి ఆదివారం రాత్రి రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఆయన హైదరాబాద్ నుంచి ఇండిగో సర్వీసులో ఇక్కడికి వచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన ఆయనకు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, హౌసింగ్ బోర్డు చైర్మన్ దవులూరి సుబ్బారావు తదితరులు స్వాగతం పలికారు. ఆయన విమానాశ్రయం నుంచి కాన్వాయ్‌లో రాజమహేంద్రవరం వెళ్లారు.

నేడు 'స్పందన'

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో యథాతథంగా నిర్వహించనున్నట్లు కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

ప్రకాశం నగర్: వాలీబాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ సురేష్ ప్రభు ఆకాంక్షించారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలోని పరిమి రామచంద్రరావు మెమోరియల్ ఫ్లెడ్‌లైట్స్ వాలీబాల్ కోర్టులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాలుర శిక్షణ శిబిరానికి ఆయన హాజరై, క్రీడాకారులను అభినందించారు. ఈనెల 28న పశ్చిమబంగాలో జరిగే 43వ సబ్ జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్ షిప్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని కోరారు.

కడియపులంక సర్పంచ్ కన్నుమూత



మార్గాని అమ్మాజీ (ఫైల్)

కడియం: కడియపులంక సర్పంచ్ మార్గాని అమ్మాజీ (55) ఆదివారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఆమె కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం రాత్రి ఆసుపత్రికి తీసుకువెళ్లే సమయంలో గుండె పోటు రావడంతో ఇంటివద్దే మృతి చెందారు. జనసేన పార్టీకి చెందిన ఆమె ఆ పార్టీ నుంచి కడియం జెడ్పీటీసీగా గెలుపొందారు. జనసేన నుంచి రాష్ట్రంలో గెలిచిన ఏకైక జెడ్పీటీసీ సభ్యురాలు ఆమె. అయితే సర్పంచ్‌గా కొనసాగాలని జెడ్పీటీసీ పదవికి రాజీనామా చేశారు. ఈమె భర్త ఏడుకొండలు రాజకీయంగా అందరికీ సుపరిచితులు. వీరికి ముగ్గురు కుమార్తెలు. అమ్మాజీ గతంలో ఎంపీటీసీగా టీడీపీ నుంచి గెలుపొందారు.

నేడు బీజేపీ జిల్లాస్థాయి సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: బీజేపీ తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం 10.30 గంటలకు పార్టీ నగర కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి బూరా రామచంద్రరావు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కోర్ కమిటీ సభ్యురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తపన చౌదరి, నూతన జిల్లా ఇన్‌చార్జి కృష్ణ భగవాన్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు.

సినిమాలు



శ్యామల	: అన్ని మంచి శకునమలే
సూర్యమినీ	: గార్డెయన్స్ ఆఫ్ దిగెలాక్సీ
సూర్యప్యాలెస్	: ఫాస్ట్అండ్‌ఫ్యూరియస్10
స్వామి	: బిచ్చగాడు-2
శివజ్యోతి	: కస్టడీ
అనుశ్రీ	: విరూపాక్ష
రాజా	: ఫాస్ట్అండ్‌ఫ్యూరియస్10
అశోక	: ఉగ్రం
ఊర్వశి	: సింహాద్రి
రంభ	: ది కేరళస్టోరీ
మేనక	: రామబాణం
అప్సర	: ఫాస్ట్అండ్‌ఫ్యూరియస్10
నామవరం	
వీఎస్ మహల్	: బిచ్చగాడు-2
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఫాస్ట్అండ్‌ఫ్యూరీయస్-10
కడియం	
వెంకట సూర్య	: బిచ్చగాడు-2